# దేనికి వోటిచ్చేది, చెప్పండి!

[పో. శా.]

తెల్లవారి లేచేసరికి మా వూరంతా అమిత కల్లోలితంగా ఉన్నట్టనిపించింది నా ప్రాణానికి. ప్రతి చిన్నా పెద్దా అందరూ ఏదో ఓ గోడదగ్గిర కెళ్లి నిలబడి ఏమిటో చదువుతున్నారు. కట కట పడుతున్నారు. మరి నాకుమాత్రం తోస్తుందీ? పైన గుడ్డవేసుకువెళ్ళి మాయింటి గోడలన్నీ పరకాయించాను. రంగురంగుల కాగితాలు. చిత్ర విచిత్రాలైన వాక్యాలు!

'నాకు గాంధీజీ ప్రశంసాపత్రం ఉంది'—హిందూస్థానీ,

'దేశభాషలందు తెలుగు లెస్స, మరి మీ నిర్ణయం?'—ఆంధ్రము.

'భాషాభిక్ష పెట్టింది నేనే, భాషామాతృమూర్తిని'—సంస్కృతం.

'నా మూలాన్న దేశం ఎంతో విజ్ఞానవంత మైంది'—ఆంగ్లము.

ఇలా ఏవేవో భాషలు తమ తమ ప్రాశస్త్యాన్ని వెల్లడించుకున్నాయి. అసలుసంగతి ప్రక్కాయన నా చెవిలో ఊదాడు. ఈ భాషలన్నీకూడా రేపు వచ్చే రాజభాషాపదవికి పోటీపడుతున్నాయట. ఇదంతా ఎలక్షన్ ప్రోపగాండాట!

నే నాంధ్రుణ్ణి, నా దృష్టి తెలుగుమీదే నిలిచి పోయింది, కాని లోపల సంస్కృతబుద్ధి పీకు తోంది. అయినా హిందూస్థానీవేపు ఓరచూపు చూశాను, ఆంగ్లాన్ని అసహ్యించుకున్నానని వేరే చెప్పాలా!

స్నానంచేసి తుడుచుకుంటున్నా, ఎవరో వచ్చారని లోపలికి కబురు! సరే, వెళ్లాను. నమస్కారాలిచ్చి పుచ్చుకున్నాం. క్లుప్తంగా ఆయన వచ్చిన పని వెళ్ళబోశాడు: "నేను హిందూస్థానీ తరఫున కాన్వాసింగుకు వచ్చాను, మీకంతా తెలుసుగా, గాంధీజీఅంతటి భారతభాగ్యవిధాతే దాన్ని ప్రశంసించాడు. అదీకాక యిప్పుడు హిందూస్థానీకెంతో ప్రాముఖ్యంఉంది, ఇటు ఉత్కళ దేశం దాటితే చాలు యిక అదేగా!" అన్నాడు.

"ఔననుకోండి, కాంగ్రెసువారు మైనారిటీలను పూజిస్తారుగా, వాటి కెక్కడలేని గౌరవం యిస్తారాయిరి! మరి మీ హిందూస్థానీకూడా యీ తెలుగు కన్నడంలాంటి మైనారిటీలను పైకి తీసుకురాగూడదుటండీ?" అని నా అనుమానం ఒకటి బయటికి కక్కేశాను.

"మరి పరిపాలనో! సరే కానివ్వండి—ఇదిగో యిదీ రంగు, ఈ బాలెట్ బాక్సులోనే వెయ్యండి సుమా!" అని ఓ కాగితంముక్క యిచ్చి ఆయన బయటికి జారాడు.

వెంటనే ఇంగ్లీషుభాషకు కాన్వాసింగు ఏజంటు వచ్చాడు. మరి ఆగష్టు పదిహేను వెళ్ళిపోయింది లాభంలేదు తిరిగిపొమ్మన్నాను. అయినా విసుక్కుండా మామీదకూడా కాస్త చూపుంచండి మాతో పని యింకా తీరిపోలేదని బెదిరింపుగా ఓ కాగితంయిచ్చి తిరోముఖం పట్టాడు.

ఓ పీడ వదిలించుకున్నా మనుకుంటూంటే ఇంకోడు తయారు! తెనుగుభాష తరఫున విచ్చేశాడుట. మర్యాదకు కుర్చీవేసి కూచోబెట్టాను.

"మనమంతా ఆంధ్రులం, మరి ఆంధ్రానికే మీ ఓటువెయ్యాలి. ఇది స్వార్థమనిపించుకోదు సుమండీ! ఇది స్వాభిమానం. అభిమానం చంపుకున్న మనిషి బ్రతికినా చచ్చినా ఒకటే అన్నది మీకు తెలిసేఉంటుంది. ఒకసారి మనుచరిత్ర



EASTERNS-384

కేసరికుటీరం, లిమిటెడ్.,

మద్రాసు, 14.

ఒరిస్సా, నైజాము డొమినియన్లు, ఆంధ్రజిల్లాలు,

తమిళనాడులకు ఏజెంట్లు:—

సీతారామా జనరల్ స్టోర్సు.

బరంపురం-సికింద్రాబాదు-బెజవాడ-మధుర.

చూడండి! శృంగారం ఎంత హిమాలయోత్తుంగ శిఖరాల కందిందో! కళాపూర్ణోదయం విన్నారా? అందులో కధాకల్పనా వైచిత్ర్యం ఎంత మహిమాన్వితంగా ఉంది! భారతంలో ఎంత రాజకీయ చాతుర్యం! అబ్బ ఏమి భక్తిరసమండీ భాగవతం నిండా! దేనిలో ఏ ఘట్టమైనా వీరరస ప్రోల్లసితంగా ఉంటుంది ఇంతకన్నా ప్రాధాన్యం దేనికిస్తాం? మూదురాయర గండడు దేన్నభిమానించాడు! తంజావూరును పాలించిన మహారాష్ట్రులు కూడా మన ముద్దుపళని రాధికాసాంత్వనాన్ని కాదూ గద్దె కెక్కించింది?.. .... సరే. వెళ్ళొస్తా" అన్నాడాయన, విన్నానంతే, మారు మాటలేదు. అలాగే కూచున్నా.

"స్వస్తి, ఈనాటి ఎన్నికల విధానం గమనించారా! సంస్కృతాన్ని మరవరాదు. ఈ భాష లన్నింటినీ అభివృద్ధికి తెచ్చింది సంస్కృతమే, కృతఘ్నములయ్యాయి. గురువుకు పంగనామాలు పెడుతున్నాయి. ఒక్కసారి కాళిదాసును తలుచుకోండి, ఒళ్లు పులకరించిపోదూ! భవభూతి, దండి, ఒకళ్లేమిటి దీన్ని సేవించి తరించిన వాళ్ళు అనేకులు. అమరజీవులు."

అంటూ వచ్చేరావడంతోనే ఎత్తుకున్నాడొక శాలువామనిషి. చెవు లప్పజెప్పి ఊరుకున్నా. ఎన్నిటికి సమాధానం యివ్వను? ప్రతివాడూ తమకే ఓటివ్వమని ప్రమాణంచేయించుకున్నంత పనిచేసి పోతుంటే? మొన్న శట్టూగారుకూడా సంస్కృతాన్ని పొగిడారుట. అదో టెస్టిమోనియల్ గా తీసుకొచ్చి చూపించాడు.

అబ్బబ్బ! ఒకళ్ళా! ఎవరెవరో వచ్చారు. ఏముఖముతో చెప్పారు. పోయారు. దేనికి ఓటిచ్చేది చెప్పండి!

---

## లక్నో కోర్టులో

ఇప్పుడు-విద్యావతులైన సతులు తమ భర్తలపై అభియోగాలు తెస్తున్నారు. పురుషుల వర్తనము తమపట్ల సరిగా లేదని వారి వాదన. కనుక మనోవర్తికోసం కొందరూ, విడాకు లిప్పించమని కొందరున్నూ దావాలు వేయడం, ఇటువంటి దావాలు రోజుకి నాలుగు, అయిదు తక్కువకాకుండ దాఖలవుతున్నాయి. వీరందరూ పత్రికలలో ప్రకటనల మూలకంగా పరిణయమైనవారేనని స్పష్టమవుతున్నది.